మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఖమ్మం రూరల్, అక్టోబర్ 1: కుటుంబ పోషణభారం తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మోరెపు పావని (30) 13 సంవత్సరాల క్రితం కొత్తగూడెం జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన గురుమూర్తితో వివాహం జరిగింది. వీరికి బాబు కార్తీక్ (16), కుమార్తె అక్షర(9) ఉన్నారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం గురుమూర్తికి పక్షపాతం రాగా అనేక వైద్యశాలలో చికిత్స చేయించడంతో ఆర్థిక సమస్యలు రావడంతో పావని అక్కడి నుంచి పిల్లలతో పాటు వచ్చి గొల్లగూడెంలో నివాసం ఉంటుంది. ఆదివారం పావని తల్లితండ్రులు కూలికి వెళ్లడంతో పావని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పావని తండ్రి అంగడాల బీమయ్య వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. కుటుంబ పోషణ బరించలేకనే తన బిడ్డ ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు బీమయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

అనుభవాలను బోధించాలి

- వృద్ధులు తమ జీవిత సారాన్ని యువతరానికి అందించాలి
- ప్రభుత్వ వైద్యశాలల్లో వయోవృద్ధులకు ప్రత్యేక విభాగాలు
- వయోవృద్ధులు, బాలికా దినోత్సవంలో ఖమ్మం కలెక్టర్

సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న ఖమ్మం కలెక్టర్,అధికారులు, చిన్నారులకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 1: వృద్ధులు తమ జీవిత అనుభవనాలను యువతరానికి అందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. యువత కూడా తమ ఇళ్లలోని వృద్ధులు, పెద్దలతో ఎల్లప్పుడు సంభాషిస్తూ వారి జీవిత సారాన్నుంచి అనుభవాలను నేర్చుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధికి తోడప్పడాలని ఆకాంక్షించారు. ఖమ్మంలో టీటీడీసీ భవనంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతరాజతీయ వయోవృద్ధుల దినోత్సవం, బాలికల దినోత్సవ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన వయోవృద్ధులు ఇన్నేళ్లుగా చేస్తున్న కృషి, వేస్తున్న పునాదుల వల్లనే సమాజం ఇలా నిలబడగలిగిందని వివరించారు. దేశ ఆర్థిక, సామాజిక ఎదుగుదలలో భాగమైన వృద్ధులను గౌరవించుకోవడం మన బాధ్యత అని అన్నారు. వయోవృద్ధులతో నేటి యువత సమయం గడపాలని సూచించారు. అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలతో గడపడం వల్ల వారి జీవతానుభవాలు మనకు బోధపడతాయని వివరించారు. కుటుంబ బంధాలను బలోపేతం చేసేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. 'రెస్పెక్ట్ ఫర్ ఎల్డర్స్' పేరిట విద్యాసంస్థల్లో వారానికి ఒక రోజును నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేస్తామన్నారు. కలెక్టరేట్‌లోనూ ప్రత్యేకంగా ఓ అటెండర్‌ను, ఓ వీల్‌చైర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా, సీనియర్ సిటీజన్స్ కూడా తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే, అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలతో కలిసి కేక్ కట్ చేశారు. డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సీనియర్ సిటిజన్స్ అర్గనైజేషన్ బాధ్యులు చంద్రమోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా కార్యక్రమాలను అమలు చేయాలి

వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వీసీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, అక్టోబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో మంత్రి.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ సచివాలయం నుంచి వీసీలో సమీక్షించారు. కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి పాల్గొన్నారు. మంత్రి సమీక్ష అనంతరం జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కార్యక్రమాన్ని జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని, ఆయా బృందాలకు అవసరమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, డీపీవో ఆశాలత, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, వేణు, అహ్మద్ షఫీ వుల్లా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఒక్కపూట బడులు

బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 1: బుధవారం నుంచి ఈ నెల12 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను ఒక్కపూట నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తూ సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు మంగళవారం జారీచేసింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొనవచ్చని ఆదేశాల్లో పేర్కొంది.

సాగర్ కాల్వలో ముగ్గురు యువకులు గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం, మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతైన ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్‌లు సోమవారం ఖమ్మం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న తన మిత్రుడిని చూసేందుకు ఆటోలో ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం మిత్రుడిని జైలులో కలిసిన తర్వాత నలుగురు యువకులు కలిసి దానవాయిగూడెంలో నివాసం ఉంటున్న చల్లా రమేశ్ అన్న కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించిన అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకోగా.. రోండ వెంకటేశ్వర్లు అందుకు నిరాకరించి ఆటోలోనే పడుకున్నాడు. ఈ క్రమంలో మిగిలిన ముగ్గురు మెట్ల మార్గం ద్వారా సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ముగ్గురు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల బట్టలు కాల్వ గట్టుపై కనిపించడంతో ఆందోళన చెందిన వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సాగర్‌లో కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. అన్నం ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు బృందం సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు యువకులు చల్లా రమేశ్, ప్రసాద్‌ల కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి..డీఈవో

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం సిటీ, అక్టోబర్ 1: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 68వ జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు ఆరు జోన్లకు చెందిన బాలురు 432 మంది కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటాపోటీగా తలపడ్డారు. అనంతరం గెలుపొందిన వారికి డీఈవో సోమశేఖర శర్మ, జిల్లా యువజన, క్రీడల అధికారిణి సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల క్రీడలకు తాము సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జిల్లాలోని అన్ని స్టేడియాల్లో అద్భుత వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కే నరసింహమూర్తి మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు.

గెలుపొందిన జట్లు..

అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో వైరా విన్నర్స్, ఖమ్మం సౌత్ రన్నర్స్. అండర్-14లో ఖమ్మం సౌత్ విన్నర్స్, సత్తుపల్లి రన్నర్స్.

అండర్-17 బాలుర ఖోఖో విభాగంలో ఖమ్మం నార్త్ విన్నర్స్, మధిర రన్నర్స్. అండర్-14లో వైరా విన్నర్స్, కూసుమంచి రన్నర్స్.

నేటినుంచి దసరా సెలవులు

13 రోజుల సెలవులు ప్రకటించిన విద్యాశాఖ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 1: తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పండుగ దసరా. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అధికారులు సెలవులు ప్రకటించారు. అన్నింటిలో పాఠశాల విద్య విద్యార్థులకు ఈ నెల 2 నుంచి ఈ నెల14 వరకు దసరా సెలవులు ఇచ్చారు. 13 రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్ విద్యాసంస్థలకు ఈ నెల 6 నుంచి ఈ నెల 13 వరకు సెలవులు ప్రకటించారు.

హాస్టళ్ల నుంచి ఇళ్లకు..

13 రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి తల్లిదండ్రులతో కలిసి మంగళవారమే ఇళ్లకు పయనమయ్యారు. అద్దెగదుల్లో ఉండేవారు కూడా సొంతూళ్లకు వెళ్లిపోయారు. దీంతో బస్సులు, ఇతర రవాణా వాహనాలు కిక్కిరిశాయి.

కొసమెరుపు..

ప్రైవేట్ విద్యాసంస్థలతోపాటు ప్